శాకాహార వినాయకుడు..!



మంచిర్యాలఅర్బన్: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక విశ్వనాథస్వామి కాలక్షేప మండపంలో ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో గణనాథుడిని పలు రకాల కూరగాయలతో అలంకరించారు. శాకాహార గణపతిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

గణేశ్ మండలి ఆధ్వర్యంలో రక్తదానం



మంచిర్యాలఅర్బన్: పాత మంచిర్యాల విశ్వకళ సమితి గణేష్ మండలి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరంలో గణేష్ మండలి సభ్యులు, గ్రామానికి చెందిన యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

లంబోదరుడికి 135రకాల నైవేద్యాలు



తాండూర్: మండలంలోని తాండూర్ బస్టాండ్ ఏరియాలోని శ్రీ గణేష్ భక్త మండలి గణనాథుడు ఆదివారం ఘనమైన పూజలు అందుకున్నాడు. స్వామివారికి భక్తులు 135రకాల నైవేద్యాలు సమర్పించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో మహిళలు, పిల్లలు, పెద్దలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కుంకుమ పూజలు



శ్రీరాంపూర్/దండేపల్లి: శ్రీరాంపూర్ ఆర్కే 8 కాలనీలోని శివభక్త గణేశ్ మండలి వద్ద, దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణ గణేష్ భక్త మండలి ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుల వద్ద ఆదివారం కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. పూజ అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

క్లుప్తంగా

మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమాలు

మంచిర్యాలఅర్బన్: మతోన్మాద పాసిజానికి వ్యతిరేకంగా విద్యార్థులు ప్రగతిశీల ఉద్యమాలు నిర్వహించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ అన్నారు. స్థానిక మార్క్స్ భవన్‌లో నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు రెండోరోజు ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై మతం పేరుతో దాడులు చేస్తోందన్నారు. నూతన జాతీయ విద్యా విధానం 2020 పేరుతో తిరోగమనంలోకి తీసుకెళ్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్ర ధాన కార్యదర్శులు ఎస్‌వీ.శ్రీకాంత్, నాగరాజు, జాతీయ నాయకుడు మహేశ్, ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెడ్డి చరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ చిత్రపటానికి క్షీరాభిషేకం

చెన్నూర్: వందేభారత్ రైలు పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని మంచిర్యాలలో ఆగేందుకు కృషి చేసిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చిత్రపటానికి స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుశీల్‌కుమార్, రాజమల్లగౌడ్, బాపగౌడ్, మహేశ్‌తివారి, ఖాలీల్, హిమవంతరెడ్డి, శ్రీధర్, నాగరాజులు పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఎన్నిక

పాతమంచిర్యాల: లంబాడి జేఏసీ జిల్లా నూతన కమిటీని ఆదివారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా అజ్మీర రాజునాయక్, తేజావత్ రాంబాబునాయక్, అధ్యక్షుడిగా బూక్యా గోపాల్ సింగ్, ఉపాధ్యక్షులుగా గుగులోత్ రవినాయక్, బూక్యా అమర్‌సింగ్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా బానావత్ రామునాయక్, కార్యదర్శులుగా జాదవ్ గజానంద్, భుక్యా చంద్, సాంస్కృతిక కార్యదర్శిగా తేజావత్ రామారావునాయక్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో లంబాడి జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్, ప్రధాన కార్యదర్శిగా రామారావు పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వాలి

మంచిర్యాలటౌన్: గోదావరి వరదతో పాత మంచిర్యాలలోని పత్తి పంట మునిగి, పంటనష్టం వాటిల్లిందని, పత్తి పంటకు ఎకరానికి రూ.40వేల పరిహారం చెల్లించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు రఘునాథ్ వెరబెల్లి డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించి, రైతులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, ఎనగందుల కృష్ణమూర్తి, బియ్యాల సతీశ్‌రావు, రాజమౌళి, రవీందర్, అశోక్ పాల్గొన్నారు.

'రాజ్యాంగాన్ని మార్చే కుట్రను తిప్పికొట్టాలి'

శ్రీరాంపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తుందని, దీనిని తిప్పి కొట్టాలని ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగ్ తెలిపారు. శ్రీరాంపూర్‌లోని ఎయిమ్స్ పాఠశాలలో ఆదివారం జరిగిన మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ వాదులంతా ఐక్యమై రాజ్యాంగాన్ని మార్చే కుటిల యత్నాలను తిప్పి కొట్టాలన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మామిడి నాగరాజును, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు గుమ్మడి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సదానందం, నాయకులు పాల్గొన్నారు.

వంట మాస్టర్‌కు వీడ్కోలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ సీనియర్ వంట మాస్టర్ కుడుక మల్లయ్య రిటైర్డ్ అయ్యారు. ఈ మేరకు ఆదివారం బెటాలియన్ వంట మాస్టర్ మల్లయ్య–సరోజ దంపతులను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కమాండెంట్ పి.వెంకటరాములు, అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వర్‌రావు, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్సైలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చేను చెరువై..!

- పొలాలను ముంచెత్తిన వరద
- వందల ఎకరాల్లో పంట నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు



ఈ రైతు పేరు నస్పూరి పోశం. ఈయనది జన్నారం మండలం తపాలపూర్ గ్రామం. ఈ రైతు మూడెకరాల పొలం చేశాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టుల వరద గేట్లు ఎత్తివేయడంతో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. గోదావరి తీర ప్రాంతంలోని తన మూడెకరాల పొలం వరదలో మునిగింది. ప్రతీరోజు పొలం వద్దకు వెళ్లి వరద ఉధృతి తగ్గుతుందని చూస్తున్నాడు. కానీ నాలుగు రోజులుగా నీటిలోనే పొలం ఉండటం వల్ల నీటిలో మురిగిపోతుందని తెలుపుతున్నాడు. వ్యవసాయ అధికారులు ఆదుకోవాలని కోరుతున్నాడు.



పత్తి చేనులో నుంచి ప్రవహిస్తున్న వరద

జన్నారం: ఇటీవల భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో ఎక్కువ కావడంతో శ్రీరాంసాగర్ 39 గేట్లు, కడెం పది గేట్లు ఎత్తారు. దీంతో గోదావరికి భారీ వరదనీరు చేరి, ఉగ్రరూపం దాల్చింది. నాలుగు రోజులుగా వరద ఉధృతి తగ్గకపోడంతో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. గోదావరి నుంచి కిలోమీటర్ మేర దూరం నుంచి వరద ప్రవహిస్తోంది. కలమడుగులో సుమారు 20మందికి సంబంధించిన వంద ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు రైతులు పేర్కొంటున్నారు. కలమడుగు గ్రామానికి రెండు వైపులా వాగులు ఉండటం వల్ల గోదావరి ఉధృతికి వాగుల ప్రవాహంతో పాటుగా గోదావరి పోటు కమ్మి బ్యాక్‌వాటర్ పొలాలు, పత్తి చేల నుంచి ప్రవహిస్తుండటంతో పొలాలు, చేన్లు మునిగిపోయాయి. బాదంపల్లి, తపాలపూర్, తిమ్మాపూర్, రాంపూర్, చింతగూడ గోదావరి తీర ప్రాంతాల్లో వందల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. వ్యవసాయాధికారులు గ్రామాల వారీగా పంట నష్టం అంచనా వేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 400మంది రైతులకు సంబంధించి 800ఎకరాల్లో వరి పంట, 150మంది రైతులకు సంబంధించిన 230ఎకరాల్లో పత్తి పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. వందల ఎకరాల్లో భూమి కోతకు గురైందని, మరికొన్ని చోట్ల పొలా ల్లో ఇసుక మేటలు వేసినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి సంగీతను 'సాక్షి' వివరణ కోరగా గ్రామాల్లో పర్యటించి పంట నష్టపోయిన రైతుల వివరాలు సేకరించినట్లు, వెయ్యి ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు తెలిపారు. నివేదికలను తయారు చేసి, ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు.

ఏటా పరిహాసమే...

పంటలు ఏటా గోదావరిలో మునిగినా పరిహా రం అపహాస్యం చేస్తుంది. ప్రతీ సంవత్సరం వ్య వసాయ అధికారులు నష్టం అంచనా వేసి, నివేదికలు ప్రభుత్వానికి పంపినా ఫలితం లేదని రైతులు పేర్కొంటున్నారు. రెండేళ్ల క్రితం ఇలాగే గోదావరి ఉధృతికి వందల ఎకరాల్లో పంట నష్టం జరిగి, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నీటిలో కొట్టుకుపోయినా అధికారులు పరిహా రం చెల్లించడంలో పట్టింపులేకుండా ఉన్నారు. రైతులే ఖర్చులు భరించి, మరమ్మతు చేయించుకున్నట్లు తెలిపారు.

పది ఎకరాల పొలం మునిగింది



నాకున్న పదెకరాలు నాటు వేశా. భారీ వర్షాలతో గోదావరి ఉప్పొంగడంతో నా పదెకరాల్లో గోదావరి నీరు చేరింది. బర్రెల ఫాం కూడా మునిగిపోయింది. రాత్రికి రాత్రే బర్రెలను వేరే చోటికి తీసుకెళ్లా. రెండేళ్ల క్రితం కూడా గోదావరి ప్రవాహం పెరిగి డైరీ ఫాం కొట్టుకుపోయింది. రెండు ఆవులు కూడా కొట్టుకుపోయాయి. ఇప్పుడు ఫాంతో పాటు పదెకరాల పొలం నష్టం జరిగింది. అధికారులు పరిహారం అందేలా చూడాలి.

– బొంతల మల్లేశ్, కలమడుగు

నాలుగు ఎకరాలు మునిగిపోయాయి



గోదావరి పక్కన నాకు ఐదు ఎకరాల పొలం ఉంది. నాటు వేసుకున్నా. గోదావరి వరదల వల్ల నా పొలంలో ప్రవాహం పారుతుంది. నాలుగు రోజుల నుంచి గోదావరి ప్రవాహం తగ్గడం లేదు. వ్యవసాయాధికారులు వచ్చి చూశారు. మూడెకరాల్లో పంట మొత్తం కొట్టుకుపోయిందని రాసుకున్నారు. అధికారులు స్పందించి పరిహారం అందేలా చూడాలి.

– జంగిలి సత్తన్న, రైతు కలమడుగు

రైతు కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం



చెక్కు అందజేస్తున్న రేంజ్ అధికారి దయాకర్

నెన్నెల: భీమిని మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతు దాగామ రామయ్య ఆగస్టు 16న పత్తి చేనుకు వెళ్తూ అడవి పంది దాడిలో మృతి చెందాడు. మృతుడి భార్య గుణక్క, కొడుకు రాజేశంకు మంచిర్యాల డీఎఫ్‌వో శివ్‌ఆశిష్‌సింగ్, కుశ్నపల్లి రేంజ్ అధికారి దయాకర్ రూ.10 లక్షల పరిహారం ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ అటవీ జంతువుల దాడుల్లో మనుషులు చ నిపోయినా, పంట నష్టం జరిగినా వెంటనే బా ధితులు అటవీ అధికారులకు సమాచారం అందించి రెండు రోజుల్లో దరఖాస్తులు చేసకోవాలని తెలిపారు. ఫారెస్ట్ అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించి విచారణ చేపడతారని చెప్పారు. జరిగిన నష్టాన్ని అంచనావేసి వారం రోజుల్లోనే బాధిత ఖాతాల్లో పరిహారం జమ చేయడం జరుగుతుందని తెలిపా రు. వన్యప్రాణుల రక్షణ ప్రజల బాధ్యత అని, వాటిని కాపాడాలని సూచించారు.

డిగ్రీ అడ్మిషన్ల గడువు పెంపు

మంచిర్యాలఅర్బన్: అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లు ఈ నెల 12వరకు పొడిగించినట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా తెలిపారు. ఇంటర్, ఐటీఐ, ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్, ఒకేషనల్ కోర్సులు పూర్తి చేసిన వారు ఓపెన్ డిగ్రీ చేసేందుకు అర్హులన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీలో అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాలకు మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంప్రదించాలన్నారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



చెన్నూర్‌లో దిష్టిబొమ్మదహనం చేస్తున్న నాయకులు

లక్సెట్టిపేట/చెన్నూర్/జైపూర్/వేమనపల్లి/తాండూర్: భారత ప్రధాని నరేంద్రమోడీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను ఆదివారం తాండూర్, వేమనపల్లి, జైపూర్, చెన్నూర్, లక్సెట్టిపేట మండల కేంద్రాల్లో బీజేపీ నాయకులు దహనం చేసి నిరసన తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా నరేంద్రమోడీకి ప్రజలు నీరాజనం పడుతుంటే రాహుల్‌గాంధీ మాత్రం ప్రధాని పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాహుల్ గాంధీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, లేనియెడల బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమాల్లో చెన్నూర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, నాయకులు దుర్గం అశోక్, తుమ్మ శ్రీపాల్, కొండపాక చారి, శివకృష్ణ, రాజేశ్వర్, వెంకటేశ్, నరేశ్, రాజశేఖర్‌గౌడ్, తాండూర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు దూడపాక భరత్‌కుమార్, జిల్లా కార్యదర్శిగా రామగౌని మహీధర్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయులు, వేమనపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్, మండల ప్రధాన కార్యదర్శి ఎనుముల వెంకటేష్, జైపూర్ మండల అధ్యక్షుడూ దూట రాజ్‌కుమార్, ప్రధానకార్యదర్శి రామగిరి రాము, లక్సెట్టిపేటలో మండల నాయకులు హరిగోపాల్, రమేష్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల నిరసన



దాంపూర్‌లో నిరసన తెలుపుతున్న రైతులు

భీమారం: తాము వేసవి వరిసీజన్‌లో ప్రభుత్వానికి సన్నరకం వరిధాన్యం ఇచ్చినప్పటికీ వాటికి ఇవ్వాల్సిన బోనస్ డబ్బులు ఇవ్వలేదని మండలంలోని దాంపూర్ గ్రామానికి చెందిన రైతులు ఆదివారం రోడ్డుపై నిరసన తెలిపారు. డీఆర్డీఏ, ఐకేపీలు కలిసి ఏర్పాటు చేసిన కేంద్రాల్లో 900క్వింటాళ్ల సన్నరకం వరిధాన్యం అమ్మినట్లు రైతులు తెలిపారు. వరిధాన్యానికి అసలు డబ్బులు చెల్లించిన ప్రభుత్వం, బోనస్ డబ్బులు మాత్రం ఇవ్వలేదని వాపోయారు. ఈ విషయమై ఐకేపీ అధికారులను సంప్రదిస్తే ఖాతాల్లో జమవుతాయని పలుసార్లు చెప్పినా, మూడు నెలలు గడిచినా జమ కాలేదని పేర్కొన్నారు. దాంపూర్ గ్రామంలోనే అందరి రైతులకు కలిపి రూ.45లక్షలు రావాల్సి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా చర్యలు చేపట్టి బోనస్ డబ్బులు ఇప్పించాలని, ఒకవేళ బోనస్ ఇవ్వకపోతే కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు.

మన్‌కీ బాత్ వీక్షణ

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని 150వ బూత్‌లో ఆదివారం దేశ ప్రధాని నరేంద్రమోడీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు వీక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపి జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ విచ్చేసి కార్యక్రమాన్ని వీక్షించారు.

డీఎంహెచ్‌వోగా అత్యుత్తమ సేవలు



డాక్టర్ హరీశ్‌రాజ్ దంపతులను సన్మానిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత, వైద్యులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా వైద్యాధికారిగా డాక్టర్ హరీశ్‌రాజ్ అత్యుత్తమ సేవలు అందించారని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. డీఎంహెచ్‌వో ఉద్యోగ విరమణ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో ఆదివారం ఘనంగా వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదని, విధుల్లో ఉన్నప్పుడు అందించే సేవలను ఎప్పటికి మరిచిపోలేమని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ అనిత, డాక్టర్ సుధాకర్‌నాయక్, మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్చంద్ర రెడ్డి, ఆర్‌ఎంవో భీష్మ, రిటైర్డ్ డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు, డాక్టర్ మల్లిఖార్జున్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాధిత రైతులకు ప్రభుత్వం అండ



తిమ్మాపూర్‌లో పంటలు పరిశీలిస్తున్న సుగుణ

జన్నారం: వరద బాధితులకు, పంట నష్టపోయిన రైతులకు ప్రజా ప్రభుత్వం అండగా ఉండి ఆదుకుంటుందని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ పేర్కొన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంట నష్టపోయిన తిమ్మాపూర్, రాంపూర్, తపాలాపూర్ గ్రామాల్లో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆదివారం పర్యటించారు. నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. ప్రజలతో సమావేశమై వాళ్ల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఎవరూ ఆందోళన చెందొద్దని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు చింద్రం చంద్రయ్య, ప్రదీప్, శాంతయ్య, గుగులావత్ రవి, కనక వెంకటేష్, గుండా లచ్చయ్య, కోవా భూమయ్య, శంకరయ్య, జాడి రాజన్న, గోలకొండ రాజన్న, దాసరి వెంకటేష్, చిందం ముత్తయ్య తదితరులు ఉన్నారు.

రిజర్వేషన్లు అమలు చేయకపోవడం సరికాదు

- ఎస్సీ ఎస్టీ టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న



మాట్లాడుతున్న రాజన్న

జన్నారం: ఎస్సీ ఎస్టీ ఉద్యోగ, ఉపాధ్యాయుల నియామకాల్లో అనుసరిస్తున్న రిజర్వేషన్లు, పదోన్నతుల విషయంలో కేడర్ల సాకుతో అమలు చేయకపోవడం సరికాదని ఎస్సీ ఎస్టీ టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న అన్నారు. జన్నారంలోని ఆర్ట్స్ అండ్ క్రియేషన్ కార్యాలయంలో ఇటీవల పదోన్నతి పొందిన రామటెంకి శ్రీనివాస్‌ను ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ మోడల్ స్కూల్, గురుకుల సిబ్బందికి 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. ఉపాధ్యాయుల అవార్డులను పారదర్శకంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, పీఆర్సీని ప్రకటించి వెంటనే అమలు చేయాలని, పెండింగ్ డీఏలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్త జిల్లాలకు డీఈవో పోస్టులు, రెవెన్యూ డివిజన్లకు డిప్యూటీ ఈవో, నూతన మండలాలకు ఎంఈవో పోస్టులను మంజూరు చేయాలన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు మార్గదర్శకాలను సవరించాలని, వివిధ జిల్లాల్లో జరిగిన పైరవీ డిప్యూటేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బదావత్ ప్రకాశ్ నాయక్, జిల్లా అధ్యక్షుడు రామటెంకి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు తుగూరు గోపాల్, నాయకులు జాడి ధర్మయ్య, శంకర్, యూటీఎఫ్ దండేపల్లి, మండల అధ్యక్షుడు రత్నం తులపతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీపీపీలో డైరెక్టర్ తిరుమలరావుకు సన్మానం

జైపూర్: మండల కేంద్రంలో గల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో ఆదివారం సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్‌ఎం)గా నూతనంగా నియమితులైన మోకాళ్ల తిరుమలరావును సింగరేణి ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎస్టీపీపీ ప్రాణహిత అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, ఎస్సీ చీఫ్ లైజన్ ఆఫీసర్ దుర్గం రామచందర్, ఎస్టీ అసోసియేషన్ చీఫ్ లైజన్ ఆఫీసర్ కృష్ణయ్య, జీఎం శ్రీనివాసులు, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షులు పంతుల, ఎస్టీ అసోసియేషన్ ఎల్‌వో దేవేందర్, గౌరవ అధ్యక్షులు మోహన్, అధికారులు, ఉద్యోగులు పూలమాలలు, శాలువాలతో సన్మానించి స్వాగతం పలికారు.

15న కోల్‌కత్తాలో ధర్నా

శ్రీరాంపూర్: ఈనెల 15న కోల్‌కత్తాలోని కోలిండియా హెడ్ ఆఫీస్ ఎదుట ధర్నా చేయనున్నట్లు ఆల్ ఇండియా కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ సింగరేణి అనుబంధ సంఘం ఉప ప్రధాన కార్యదర్శి వేణుమాధవ్ తెలిపారు. రిటైర్డ్ కార్మికులకు పెన్షన్ పెంపుదల డిమాండ్‌తో ఈ ధర్నా తలపెట్టినట్లు పేర్కొన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ పెంపు, మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ కార్మికులు తరలిరావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మందమర్రిరూరల్: సింగరేణిలో గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు దారావత్ పంతుల నాయక్ అన్నారు. స్థానిక సీఈఆర్ క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఏరియా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బానోత్ రామునాయక్ ఎన్నికయ్యారు.

బొగ్గుబాయి వార్తలు

కాంట్రాక్ట్ కార్మికులకు ప్రయోజనాలు

శ్రీరాంపూర్: బొగ్గు గనుల్లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు ప్రయోజనాలు చేకూరేలా కోల్ ఇండియా యాజమాన్యం నిర్ణయం తీసుకుందని బీఎంఎస్ బొగ్గు గనుల ఇన్‌చార్జి లక్ష్మారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోల్‌కత్తాలోని సీఐఎల్ కార్యాలయంలో ఆదివా రం జరిగిన కోల్ ఇండియా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో కాంట్రాక్టర్ కార్మికులకు సంబంధించి పలు నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు.

కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించాలి

తాండూర్: కార్మికులకు మెరుగైన వైద్యం అందడం లేదని ఆదివారం ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ ఆరోపించారు. కమీషన్లకు ఆశపడుతూ మెరుగైన వైద్యం అందుబాటులో లేని ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారని మండిపడ్డారు. అధికారులు సింగరేణి కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించాలన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

మంచిర్యాలఅర్బన్: విద్యారంగ సమస్యలపై యూఎస్‌ఎఫ్‌ఐ నిరంతర పోరాటం చేస్తుందని యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి అన్నారు. స్థానిక ఎస్సీ బాలుర వసతిగృహంలో ఆదివారం ఈ నెల 23న లక్సెట్టిపేటలో తలపెట్టిన యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రథమ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. మహాసభలను విజయవంతం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు మణిచరణ్, సాయితేజ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టు

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో ముందస్తు జాగ్రత్తగా పోలీసులు కాంగ్రెస్, కమలనాథులను అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్, బీజేపీ శ్రేణులను కొందరిని అదుపులోకి తీసుకొని టూ టౌన్‌కు తరలించగా , పలువురిని హౌస్ అరెస్ట్ చేశారు.